# '1 ఆఫ్ 70' రద్దు - గిరిజనుల సమస్యలు

— కె. బాలగోపాల్

నిజమయిన సమస్యలు తరచుగా అబద్ధపు కారణాలవల్ల వెలుగు చూస్తుంటాయి. సామాజిక చైతన్యం తలక్రిందులుగా ఉన్నంతకాలం ఇది తప్పదేమో. చైతన్యం పదార్థానికి ప్రతిఫలనమేకానీ ఆ ప్రతిఫలనం యాంత్రికంగా జరగదు. సామాజికంగా జరుగుతుంది. అధికార భావ జాలం దానిని జల్లెడ పడుతుంది. ఆ భావజాలం ఎంత బలంగా వుంటే చైతన్యం అంత తలకిందులుగా వుంటుంది. ఒక సమస్య మన కళ్ళ ముందే వుంటుంది. కాని అంతమాత్రంచేత మనం దానిని గుర్తించము. అది గుర్తింపు పొందాలంటే ముందు ఆ గుర్తింపు సాధికారతను (legitimacy) సాధించుకోవాలి. దానిగురించి సుప్రీంకోర్టో, హిందూ దినపత్రికో మాట్లాడాలి. అప్పుడు మనంకూడ మాట్లాడతాం. మన దేశం లోని పౌరహక్కుల సంఘాలు ఎంతో శ్రమచేసి సేకరించిన నివేదికలను మర్యాదస్తులు పట్టించుకోరు. కానీ అవే నివేదికలను తప్పొప్పుల పట్టిక సహితం లేకుండా టైపుచేసి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు పంపితే, వారు దానిని తమ నైసర్గిక సాంస్కృతిక అజ్ఞానంతో అస్తవ్యస్తంగా సంక్షిప్తం చేసి లండన్‌నుండి విడుదలచేస్తే, 'ఆమ్నెస్టీ రిపోర్టు ఎంత వివరంగా వుంది' అని మెచ్చుకుంటూ చదువుతారు.

ఆదివాసుల భూమి సమస్య మన దేశంలో కుల సమస్య అంత ప్రాచీనమైన సమస్య. అయితే ఈమధ్యనే అది అకస్మాత్తుగా గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970 ని (క్లుప్తంగా, '1 ఆఫ్ 70') రద్దుచేయాలని నిర్ణయించుకోవడంతో ఆ సమస్య చర్చకు వచ్చింది. అపైన తాము అకస్మాత్తుగా చైతన్యవంతులయిన విద్యావంతులు 'గిరిజనులలో కదలిక లేదండీ' అని పెదవి విరుస్తున్నారు కూడ. '1 ఆఫ్ 70' రద్దుగురించి 'గిరిజనులు ఏమనుకుంటున్నారో తెలుసుకుందా'మని బస్సెక్కి ఉట్నూరుకూ, వెంకటాపురానికీ పోయిన పత్రికా విలేకరులు చాలా నిరాశతో తిరిగివచ్చారు.

కాని నిజానికి గిరిజనులలో తమ భూమి సమస్య గురించి చాలా కదలిక వుంది - ఇవ్వాళేకాదు, ఎప్పుడూ వుంది. సిపిఐ(ఎమ్-ఎల్) గ్రూపుల మద్దతుతో రాష్ట్రంలోని గిరిజనులు 1 లక్ష ఎకరాలకు పైగా అడవి భూమిని నరికి సాగుచేసుకుంటున్నారని ప్రభుత్వమే అంటుంది. మరి ఈ రద్దునుగురించి వాళ్ళలో పెద్దగా అలజడి లేదంటే దానికి కారణం అసలు ఆ రెగ్యులేషన్‌ను ప్రభుత్వం ఎన్నడూ సమర్థవంతంగా అమలు చేసింది లేదు. దానివల్ల ఎన్నడయినా ప్రయోజనం పొందివుంటే ఇవ్వాళ అది పోతోందని బాధపడేవారు. కాగితంమీద చూస్తే అందులో కనబడే పటిష్టమయిన నియమాలు అమలులో ఎన్నడూ దర్శనం ఈయలేదు కాబట్టి తాము ఏదో పోగొట్టుకుంటున్నామని సామాన్య గిరిజనులకు 'తెలియదు'. చదువుకున్నవాళ్ళకు ఉండే పరాయీకృత చైతన్యంలో ఒక అంశం ఏమి టంటే వాళ్ళ దృష్టిలో భాషకూ మాటలకూ చట్టాలకూ కోర్టు తీర్పులకూ ఒక స్వయం అస్తిత్వం ఉంటుంది. ఒక అభిప్రాయాన్ని ఉచ్ఛరించగానే ఏదో ఉనికిలోకి వచ్చేసిందని భయపడి సిగపట్లకు దిగినట్టే ఒక చట్టం (లేక జీవో అయినా సరే) జారీకాగానే ఏదో ఉనికిలోకి వచ్చేసిందని భయ పడడం / ఆశపడడం జరుగుతూంటుంది (పత్రికలు మొదటిదానితోనూ, వృత్తి సంఘాలు రెండవదానితోనూ కాలక్షేపం చేస్తుంటాయి). జనం మట్టుకు దేనికయినా సామాజిక రూపం వచ్చినప్పుడే అస్తిత్వం ఉన్నట్టు గుర్తిస్తారు. అందుకే మనం ఆవేశపడమన్నప్పుడల్లా ఆవేశపడరు. ఇందులో రెండువైపులా లోపం లేకపోలేదుగానీ మనంమాత్రం మన అహంభావంతో జనంలోనే లోపం ఉందనుకుంటాము.

అబద్ధపు కారణాలవల్ల వాస్తవాలను గుర్తించడంలో ఉండే సమస్య ఏమిటంటే మనం ఆ వాస్తవాలను అస్తవ్యస్తంగా గుర్తిస్తాం. ఒక విషయం నిజమయినంత మాత్రాన గుర్తించం. అది సాధికారమయిన వ్యక్తీకరణ పొందినప్పుడు మాత్రమే గుర్తిస్తామంటే, మనచేత గుర్తింపు పొందేది అసలు విషయంకాక అది వ్యక్తీకరణ పొందిన రూపంమాత్రమే అవుతుంది. ప్రస్తుత ఉదాహరణ గురించి చెప్పాలంటే, గిరిజనుల సమ స్యలను గురించి మాట్లాడేటప్పుడు మైదాన ప్రాంతాలవారి దోపిడీ దురాక్ర మణలనూ, ప్రభుత్వం 'రిజర్వ్' ఫారెస్ట్ పేరుమీద అడవులను తన ఆస్తిగా ప్రకటించుకొనడాన్నీ, విడదీసి చూడడం కష్టం. అయితే '1 ఆఫ్ 70' రద్దునుగురించి దినపత్రికలలో వచ్చిన వ్యాసాలలోనూ, రిపోర్టుల లోనూ ఈ రెండవ అంశం ప్రస్తావనే లేదు. అసలు అది ఒక సమస్య అన్న గుర్తింపే లేదు. ఆంగ్ల నుడికారంలో చెప్పాలంటే రిజర్వ్ ఫారెస్ట్ అనేది ఒక holy cow. దానివల్ల గిరిజనులకు నష్టం జరిగినంతమాత్రాన మనం దానిని ఒక చర్చనీయాంశంగా గుర్తించం. రిజర్వ్ ఫారెస్టుల వల్ల పరిసరాల సమతుల్యానికో, వాతావరణ పరిశుభ్రతకో నష్టం అని ఎవరయినా 'అంతర్జాతీయ నిపుణులు' అంటే బహుశా అప్పుడు దాని గురించి మాట్లాడతామేమో.

---

ఇంతవరకు షావుకార్లుగా వచ్చి గిరిజనులను మాయజేసి తప్పు లెక్కలు ఏసి దోచుకున్న డబ్బుని లెక్కలుగట్టి ఎట్టి మినహాయింపులు లేకుండా పేరుపేరున గిరిజనులకు ఇప్పించేరు. అలా యివ్వడానికి ఇష్ట పడని షావుకార్లు కిరాయి గూండాలను పంపించి చంపించబోతే ఎదురు దెబ్బతీసి నిలబడ్డారు. సచ్చిన కుక్కల్లాగ షావుకార్లు భయపడ్డారు.

ఆ ప్రకారం అన్నిగాడికి తనను దోచుకున్న షావుకారినుండి బాకీ డబ్బంతా కక్కించి ఇప్పించేరు. ఇప్పుడు అన్నిగాడు సంపాదన లేక పోయినా చావునుండి తప్పడి బతుకుతున్నాడు. సంఘ సభ్యుడయ్యాడు.

—o—

నాగరిక సమాజం మొదలయినప్పటినుండీ - అంటే మనుషులు వ్యవసాయం చేయడం నేర్చుకొన్నప్పటినుండీ - ఆదివాసుల భూములను నాగరికులు కాజేయడం జరుగుతూనే వుంది. ఆదివాసులు ఈ దాడిని ప్రతిఘటించారు. లొంగిపోయారు. ప్రతిఘటించలేక పారిపోయారు. వీటన్నిటి దాఖలాలూ మన చరిత్రలోనూ, పురాణాలలోనూ కావలసినన్ని దొరుకుతాయి. భూమిని ఆక్రమించుకోవడంలోనూ, కాపాడుకోవడంలోనూ రాజ్యాధికారం తప్పనిసరి కాబట్టీ, రాజులు చేసిన యుద్ధాలే చరిత్ర అనిపించుకుంది కాబట్టీ, మన చరిత్రను మనం పురాణాలలో దాచుకున్నాం కాబట్టీ. ఇవి ఇటు దేవుళ్ళు, అటు రాక్షసులూ నిషాదులూ యక్షులు మొదలయిన వారిమధ్య జరిగిన యుద్ధాల రూపంలో మనకు కనబడతాయి.

రాజ్యాలు బలంగానూ, కేంద్రీకృతంగానూ ఉన్నప్పుడు భూముల ఆక్రమణేకాక, అడవి సంపదమీద ఆదివాసులనుండి శిస్తు వసూలుచేసే అధికారమూ, వెట్టిచాకిరీ వెట్టిముడుపులూ స్వీకరించే పెత్తనమూ కూడ నాగరికులు కోరుకున్నారు. దానికోసం ఆదివాసులమీద జమీందారులను నియమించడంతోబాటు, ఆదివాసులలోనే శిస్తు వసూలుచేసిపెట్టే దళారులను తయారుచేయడం జరిగింది (గోదావరి ఏజెన్సీలో వీరిని ముఠాదార్లు అనేవారు). దీనినికూడ గిరిజనులు కొంత ప్రతిఘటించడం, ఆపైన లొంగిపోవడం లేక పారిపోవడం జరిగింది. బెంగాల్ ప్రెసిడెన్సీలో బ్రిటిష్ వాళ్ళు వ్యవస్థీకరించిన జమీందారీ వ్యవస్థ అడవులమీదకూడ తన పెత్తనాన్ని ప్రకటించుకోవడం సంథాల్ పోరాటానికి కారణంకాగా, గోదావరి ఏజెన్సీలో ఒక శతాబ్దం పైగా ఎడతెరిపిలేకుండ సాగిన అలజడికి గల కారణాలలో ముఠాదారీ వ్యవస్థ ఒకటి.

16వ శతాబ్దం మధ్యభాగంలోనే - అంటే దేశంలో బ్రిటిష్ ఆధిపత్యం నెలకొనకముందే - రంపచోడవరం ప్రాంతపు గిరిజనులు ఏలూరు పట్టణంమీద దాడిచేసి ఆ పట్టణవాసులను భయభ్రాంతులను చేశారవి వెన్నెలకంటి రాఘవయ్య అంటారు. అంతకంటే పూర్వం కాకతీయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వరంగల్ జిల్లా అడవిప్రాంతపు కోయలు చేసిన ప్రతిఘటన పురాణం రూపంలో చరిత్రకెక్కింది. ఆ పోరాటంలో చనిపోయిన సమ్మక్క సారలక్కలు గిరిజన దేవతలయి - ఆ తరువాత అక్కడకు పోయి స్థిరపడిన మైదాన ప్రాంతాలవారికికూడ దేవతలయి - ఇప్పటికీ మేడారం జాతరలో పెద్దయెత్తున పూజలు అందుకుంటారు. అంతకంటే ఇంకా పూర్వం మౌర్య చక్రవర్తులుకూడ ఆదివాసులనుండి ప్రతిఘటన ఎదుర్కొన్నారని చరిత్ర చెబుతుంది.

భూమి దురాక్రమణ, శిస్తు వసూలు, నిర్బంధపు ముడుపులు, వెట్టిచాకిరీ, వీటన్నిటితోబాటు అడవులలోకి ప్రవేశించిన నాగరిక పాలనా యంత్రాంగం, దానికి స్వాభావికమయిన అవినీతి, అణచివేత - ఇవి మధ్యయుగాలలో గిరిజనులు నాగరికులనుండి ఎదుర్కొన్న సమస్యలు. అయితే ప్రపంచంలోకి 'పెట్టుబడి' అనేది ప్రవేశించడంతో వాళ్ళ సమస్యలు పెరిగాయి. అడవులలో దొరికే కలప, ఖనిజాలు పెట్టుబడికి చాల అవసరం. వాటికోసం పెట్టుబడి అడవులను పెద్దయెత్తున నాశనంచేస్తుంది యూరప్‌లో సామాజిక ఆధిపత్యం సాధించిన పెట్టుబడి మనబోటి దేశాలను వలసలగా లొంగదీసుకుంది ఇక్కడి సకల సంపదలతోబాటు అటవీ సంపదనుకూడ తన గుప్పిట్లోకి తీసుకుంది, ధ్వంసం చేసింది. మన దేశంలో బ్రిటిష్‌వాళ్ళు తమ రవాణా అవసరాలకోసం రైలుమార్గాలు వేయడంతో రైల్వే స్లీపర్లకు కావలసిన కలపకోసం హిమాలయ పర్వతాల దేవదారు అడవులు విస్తారంగా ధ్వంసం అయినాయి. ఆధునికకాలంలో అడవుల విధ్వంసనం ఆరకంగా మొదలయింది. ఆ తరువాత బీహార్, బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలు కలిసేచోటనున్న ఖనిజసంపద (ప్రధానంగా ఇనుము, బొగ్గు, సున్నపురాయి) కోసం అడవులలోకి పెట్టుబడి, దాని ప్రభుత్వమూ ప్రవేశించాయి. పోనుపోను పెరిగిన నాగరిక అవసరాల కోసం - ఇంటి దూలాలకు కలప, తలుపులకూ కిటికీలకూ కలప, ఫర్నిచర్‌కు కలప, ఓడల నిర్మాణానికి కలప, కాగితపు గుజ్జుకోసం కలప - అడవులమీద పెట్టుబడి దాడి పెరుగుతూవచ్చింది. ఈ కలపకోసం ప్రభుత్వం అడవులను 'సంరక్షించడం' మొదలుపెట్టింది. రక్షిత అడవులలో ప్రభుత్వానికీ, దాని కాంట్రాక్టర్లకూ తప్ప వేరే ఎవ్వరికీ కట్టె కొట్టుకునే హక్కులేదు. అడవులలో వ్యవసాయంచేసుకునే హక్కు అసలేలేదు.

ప్రాచీన కాలంనుండి వస్తూన్న మైదాన ప్రాంతాలవారి దురాక్రమణతోబాటు, పెట్టుబడి రంగప్రవేశంతో చాలా పెరిగిపోయిన ఈ నిర్బంధం కూడ ఆదివాసుల భూమి సమస్యకు కీలకమయిన విషయమే. రక్షిత వనాలలో వ్యవసాయం చేసుకోలేకపోవడమేగాక, ఇల్లు కట్టుకోవడానికి కట్టె కావాలన్నా, పశువులను అడవులలో మేపుకోవాలన్నా అటవీశాఖ ఉద్యోగులకు కానుకలూ లంచాలూ ఇయ్యాల్సి వుంటుంది. ఈ రెండింటి ఫలితంగా గిరిజనుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగా తయారైంది.

మైదాన ప్రాంతాలవాళ్ళు గిరిజనులు సాగుచేసుకుంటూన్న భూముల్ని రకరకాల పద్ధతులలో ఆక్రమించుకున్నారు. రాజులనుండి నవాబులనుండి ఆ భూములను 'ఇనాం'లగా పొంది ఆక్రమించుకున్నవారు కొందరు. వ్యవసాయాన్ని అభివృద్ధిచేసి తమ భూమిశిస్తును పెంచుకునే ఉద్దేశ్యంతో రాజులు గిరిజనులు సాగుచేస్తున్న భూములను మైదాన ప్రాంతం వారికి అమ్మగా కొనుక్కున్నవారు మరికొందరు (పాలనా యంత్రాంగం తన రెవెన్యూ పెంచుకోవడానికి ఇదొక అనువయిన మార్గం అని కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో సూచించాడు. మౌర్యులనుండి హైదరాబాద్ నవాబుల దాకా ఈ దేశాన్ని ఏలిన రాజులంతా ఈ సూక్తిని అనుసరించారు). మరికొందరు రకరకాల చిల్లరవ్యాపారాలతో గిరిజన ప్రాంతాలలోకి ప్రవేశించి వాళ్ళకు మిల్లుబట్టలూ, పొగాకూ అమ్మి అందుకు ప్రతిఫలంగా అడవి సంపదను కారుచవగ్గా వాళ్ళనుండి దోచుకొని లాభాలు సంపాదించి ఆ లాభాలతో మళ్ళీ గిరిజనుల భూములను కొన్నారు. ఇంకొందరు గిరిజనులకు విపరీతమయిన వడ్డీకి అప్పులిచ్చి బాకీ లెక్కలు ఒకటికి రెండు చెప్పి వాళ్ళ భూములు కాజేశారు. కొందరు ఈ బాధలేమీ లేకుండా వట్టి కండ బలంతో గిరిజనుల భూములను ఆక్రమించుకున్నారు. ఇంకా కొందరు

జమీందార్లకూ, రెవెన్యూ అధికార్లకూ, పట్వారీలకూ లంచాలు యిచ్చి గిరిజనుల భూములను తమ పేరిట రాయించుకున్నారు. వీళ్ళందరూ పెద్ద భూస్వాములు కారుగానీ 'న్యాయంగా' భూములు సంపాదించినవారు బహు కొద్దిమంది మాత్రమే.

ఈ విధంగా మైదాన ప్రాంతాలవారు ఒక వరదగా గిరిజన ప్రాంతాల్లోకి ప్రవేశించారు. ఇవ్వాళ రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతాల జనాభాలో 48 శాతం గిరిజనేతరులు ఉన్నారు. షెడ్యూల్డు ప్రాంతాలలోని పట్టా భూముల్లో 56 శాతం ఈ గిరిజనేతరుల పేరుమీద వుంది (పట్టా గిరిజనుల పేరుమీద వుండి గిరిజనేతరులు రకరకాల నెపాలతో అనుభవిస్తోన్న భూములనుకూడ లెక్కగడితే ఇది ఎంతలేదన్నా 70 శాతానికి పెరుగుతుంది). షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనేతరుల బలం ఇంతగా ఉండగా, ఇటు గిరిజనుల పరిస్థితి ఏమిటంటే వారి జనాభాలో 60 శాతం పైగా షెడ్యూల్డు ప్రాంతాల వెలుపల నివసిస్తున్నారు। ఎక్కువగా మైదాన ప్రాంతాలలో నివసించే లంబాడాలను ఒక దశాబ్దం క్రితం అకస్మాత్తుగా షెడ్యూల్డు తెగగా గుర్తించడం ఈ విచిత్ర పరిస్థితికి కొంతవరకు కారణం కాగా, మన రాష్ట్రంలో కోయ, గోండు తెగలతోబాటు ప్రధాన గిరిజన తెగలయిన ఎరుకల యానాది తెగలు నివసించే ప్రాంతాలలో భూమి దురాక్రమణ నూటికి నూరుశాతం జరిగిపోయి అదంతాకూడ ఇప్పటికే మైదాన ప్రాంతం 'అయిపోయి వుండడం' దీనికి ప్రధాన కారణం. వాళ్ళ భూమి సమస్యను చరిత్ర ఇప్పటికే ఈ రకంగా పరిష్కరించేసింది. ఇంకా కొంత సమస్య పరిష్కారం కాకుండ మిగిలిపోయిన గోండు, కోయ (ఇతర చిన్న తెగల) ప్రజలు మాత్రమే భూమి సమస్యను గురించి బాధపడుతున్నారు. వాళ్ళ సమస్యనుకూడ ఎరుకల యానాదుల సమస్యలాగా పరిష్కరించేస్తే ఇక రాష్ట్రంలో షెడ్యూల్డు ప్రాంతాలనేవే ఉండనక్కర్లేదు. హాయిగా ఎవరయినా ఎక్కడయినా భూములు కొనుక్కోనీ, అమ్ముకోనీ సుఖంగా బ్రతకొచ్చు - స్తోమత వుంటే.

ఈ రకంగా గిరిజనేతరుల దురాక్రమణ జరిగినప్పుడల్లా గిరిజనులు అడవిలోకి పోయి అడవి నరుక్కొని ఇంకొంచెం భూమి సాగులోకి తెచ్చుకుంటారు. నిజానికి ఈ అవకాశం ఉన్నంతకాలం వాళ్ళు మైదానప్రాంతాలవారి దాడిని పెద్దగా ప్రతిఘటించకపోవచ్చును కూడ. అయితే ప్రభుత్వం రక్షిత వనాల పేరిట ఈ అవకాశం లేకుండ చేయడంవల్ల గిరిజనులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడక తప్పలేదు. ఆధునిక కాలంలో (అంటే బ్రిటిష్‌వారి ఆగమనం తరువాత) జరిగిన గిరిజన పోరాటాలను మూడు కోవలుగా విభజించవచ్చును. ఒకటి, మైదాన ప్రాంతాల వడ్డీ వ్యాపారస్తులకూ, భూమి దురాక్రమణదారులకూ వ్యతిరేకంగా జరిగినవి. రెండు, గిరిజనులనుండి శిస్తు సేకరించే ఉద్దేశ్యంతో నెలకొల్పిన రెవెన్యూ యంత్రాంగం అనుసరించే దోపిడీ పద్ధతులకు వ్యతిరేకంగా జరిగినవి. మూడు, అడవులమీద గుత్తాధిపత్యాన్ని ప్రకటించుకొని గిరిజనులకు అవి అందుబాట్లో లేకుండచేసి, లంచాలతోనూ, కోర్టు కేసులతోనూ పీడించే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగినవి. భూమి శిస్తు ప్రాధాన్యత తగ్గేకొద్దీ రెండవ కోవకు చెందిన సంఘర్షణలు తగ్గినా, పరిపాలనా యంత్రాంగం (రెవెన్యూ, అటవీ శాఖలు) చేసే దోపిడీ ఇప్పటికీ గిరిజన పోరాటాలకు ఒక ప్రేరకంగానే వుంది. బూర్జువా స్వరూపంగల ఈ యంత్రాంగం ఫ్యూడల్ దోపిడీ రూపాలన్నింటినీ వాడుకోవడంలో దిట్ట అని దేశంలోని గిరిజనులకే కాదు, జనం అందరికీ తెలుసును.

తూర్పు గోదావరి ఏజెన్సీ ప్రాంతపు గిరిజనులు పై మూడు కారణాలవల్లా 19వ శతాబ్దం మొదటిభాగం నుండీ అలజడి చేస్తూనేవున్నారు. ఒక్కొకసారి బహిరంగ పోరాటం రూపంలోనూ, ఒక్కొకసారి ప్రభుత్వ యంత్రాంగాన్ని చీకాకుపెట్టే అకస్మాత్తు దాడుల రూపంలోనూ చేశారు. 1915-16 సంవత్సరాలలో ఈ రెండవ కోవకు చెందిన అలజడి విస్తృతంగా జరిగింది. దానిని బలప్రయోగంతో అణచివేసే క్రమంలో బ్రిటిష్ ప్రభుత్వానికి కొంచెం జ్ఞానోదయం అయింది. గిరిజనేతరులనుండి గిరిజనులను కాపాడడానికి కనీసమయిన చర్యలయినా చేపట్టకపోతే 'శాంతిభద్రతలు శాశ్వతంగా కరువవుతాయని గ్రహించింది. దానితో 1917లో మొట్టమొదటి గిరిజన సంక్షేమ చట్టం వచ్చింది. దాని పేరు ఏజెన్సీ ప్రాంతాల వడ్డీ మరియు భూమి బదిలాయింపు చట్టం (1917). గిరిజనులనుండి షావుకార్లు వసూలు చేసే వడ్డీ 12 శాతానికి మించకూడదనీ, గిరిజనేతరులు జిల్లా అధికారుల అనుమతి లేకుండా గిరిజనుల భూములను కొనుగోలు చేయకూడదనీ ఈ చట్టం అంటోంది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే గిరిజనుల సమస్యలకు గిరిజనేతరుల బాధ్యత ఎంతవుందో, రాజ్యాంగ యంత్రం బాధ్యతా అంతగా వున్నా, చట్టం మొదటిదానిని మాత్రమే గుర్తించి నియంత్రించే ప్రయత్నం చేసింది (ఈనాటికీ అంతే - చట్టాలంటూ చేయడం జరిగితే అది గిరిజనేతరుల వ్యవహారాలను నియంత్రించడానికే తప్ప రాజ్యాంగ యంత్రం అధికారాలను నియంత్రించడానికి కాదు. రాజ్యాంగ యంత్రం అనేది వర్గాలకు అతీతంగా ప్రజల 'సంక్షేమాన్ని' చూసుకుంటుంది అనే భ్రమను మన దేశంలో ఎంతగా పోషించారంటే ఈ వాస్తవాన్ని గుర్తించడానికి కూడ కొంత సమయం పడుతుంది. అడవుల సంరక్షణ అంటే దేశంలోని ధనికవర్గాల అవసరాలు తీర్చడంకోసం అడవులను గిరిజనులనుండీ కాపాడడం అని అర్థం చేసుకోకపోతే ఈ భ్రమలో పడిపోయే ప్రమాదం చాలా వుంటుంది).

ఈ చట్టాన్ని జారీచేసిన అయిదేళ్ళలోనే అధికార యంత్రాంగం దోపిడీ స్వభావానికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు నాయకత్వాన 'భద్రాచలంనుండి శ్రీకాకుళందాకా విస్తరించిన' గిరిజన పోరాటం మొదలయింది. నర్సీపట్నం-చింతపల్లి రహదారి వేయించడానికి తూర్పుగోదావరి ప్రాంతపు గిరిజనులచేత స్థానిక అధికారులు వెట్టిచాకిరీ చేయించడం ఈ తిరుగుబాటుకు సమీప కారణం. స్పష్టంగా సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావాన్ని కలిగివున్న ఈ పోరాటాన్ని అణచడానికి బ్రిటిష్‌వారికి రెండు సంవత్సరాలు పట్టింది.

సామ్రాజ్యవాద పులిని చూసి నైజాం నక్కకూడ వాత పెట్టుకుంది. ఆదిలాబాద్ జిల్లాలో అధికసంఖ్యలో నివసించే గోండు కోలాం నాయకపు

తెగలు సాగులోకి తెచ్చిన లక్షల ఎకరాల భూమిని గిరిజనేతరులకు వేలం వేసింది. ఇదికాక, చాలమంది గిరిజనేతరులు ఆదిలాబాద్‌కు వలసపోయి స్థానిక రెవెన్యూ అధికారుల సాయంతో భూములు పట్టా చేయించుకున్నారు ఇక వర్తక దోపిడీ, వడ్డీ వ్యాపారస్తుల దోపిడీలు సరేసరి. అదే సమయంలో కలపకోసం అడవులను 'సంరక్షించడం', బొగ్గు, సున్నపురాయి విస్తారంగా లభించే ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ (ఇప్పటి ఖమ్మం) అడవులను ఆ ఖనిజాలకోసం ధ్వంసంచేయడం ప్రారంభం అయింది. అంటే మళ్ళీ రెండువైపులనుండీ గిరిజనులమీద ఒత్తిడి మొదలయింది. దీనిపట్ల నిరసన తెలుపుతూ ఆదిలాబాద్ గిరిజనులు చేసిన ప్రముఖ పోరాటం కొమురం భీం నాయకత్వంలో నడచిన జోడేఘాట్ పోరాటం. ఈ పోరాటాన్ని అణచివేసిన అనంతరం ఏదో ఒక సంస్కరణను ప్రవేశ పెట్టాల్సిన అవసరం నిజాం ప్రభుత్వానికి సహితం తోచింది. దాని ఫలితంగా 1946లో గిరిజన ప్రాంతాల నియమావళి (Tribal Areas Regulations, Fasli 1356) తయారయింది. ఈ నియమావళిలో వున్న చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే భూమి బదలాయింపుల నిర్ధారణలో గిరిజన గ్రామ పంచాయితీలకు ప్రముఖ స్థానం ఇవ్వడం. దీనివలన గిరిజనులకు కొంత మేలు జరిగిందనీ, అనేక వేల పట్టాలు కొద్దికాలంలోనే గిరిజనులకు ఇవ్వడం జరిగిందనీ అంటారు. అయితే ఇదీ ఎక్కువకాలం నిలవలేదు.

ఈ చట్టాలే ఇప్పటికీ (కొన్ని మార్పులతో) వున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత 1959 లో షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాన్ని జారీచేసి 1963 నుండి తెలంగాణకు కూడ వర్తింపజేశారు. అయితే పోరాటాల ఫలితంగా రాసిన చట్టాలను ఆ పోరాటాల వెనుకనున్న ఉద్విగ్నతను చల్లార్చడానికి ఎంత కావాలో అంతమట్టుకే అమలుచేసి ఆపైన విస్మరించడం ప్రభుత్వ యంత్రాంగం నైజం. 1959 లో రూపొందించిన చట్టాన్ని అమలుపరచవలసిన అవసరమేదీ ఆనాడు ప్రభుత్వానికి కనిపించలేదు. 10 సంవత్సరాల దాకా ఆ చట్టానికి అవసరమయిన నియమావళిని సహితం రూపొందించలేదు. 1968 తరువాత ఒక ఉప్పెనగా వచ్చిన శ్రీకాకుళ పోరాటం మళ్ళీ ప్రభుత్వాన్ని కుదిపింది. ఆ పోరాటాన్ని ఒకవైపు 'ఎన్‌కౌంటర్ల' రక్తపుటేట్లో ముంచుతూ, మరొకవైపు సంస్కరణలగురించి పునరాలోచన చేసింది ప్రభుత్వం. తత్ఫలితంగా మూడు చర్యలు చేపట్టింది. రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970 పేరిట 1959 చట్టానికి ఒక రూపం యిచ్చి పటిష్ఠం చేసింది. ముఠాదారీ వ్యవస్థను రద్దుచేసింది. ప్రైవేట్ వ్యక్తుల దోపిడీని అరికట్టడానికని చెప్పి గిరిజన సహకార సంఘాలను నెలకొల్పింది.

ఏ పాలకవర్గమూ సంస్కరణలను ఉద్యమాలకు సమాధానంగా చేపట్టదు. ఉద్యమాలకు సమాధానం నిర్బంధమే. సంస్కరణలు ఆపైన నిర్మించే పాలరాతి సమాధి కట్టడాలు. ముఠాదారీ వ్యవస్థను 1970లో రద్దుచేశారుగానీ, భూమిశిస్తు ప్రభుత్వ ఆదాయంలో తన ప్రాధాన్యతను కోల్పోయిననాడే ఈ వ్యవస్థకుకూడ కాలంచెల్లింది. అపైన అదొక చారిత్రక అవశేషంగా నిలిచిపోయింది (గ్రామాలలో పటేల్ - పట్వారీ లేక మునసబు - కరణం వ్యవస్థలాగ). కొద్దిమంది గిరిజన ప్రముఖుల చేతిలో తమ సాటి గిరిజనులను పీడించే సాధనంగా ఉండింది. దానిని రద్దు చేయడం నామమాత్రపు చర్య.

ఇక గిరిజన సహకార సంఘాల మాటకొస్తే, వాటినిగురించి గిరిజనుల నోట ఒక్క మంచి మాటయినా వినడం కష్టం. బయటి ఉత్పత్తులను గిరిజనులకు క్రమబద్ధంగా సరఫరా చేయడంలో విఫలం కావడం అటుంచి, గిరిజనులు అడవినుండి సేకరించే చిన్నతరహా అడవి ఉత్పత్తికి (minor forest produce) గిరిజన సహకార సంఘాలు ప్రైవేట్ వ్యాపారస్తులకంటే ఎక్కువ ధర ఇస్తాయన్న ఆశ వట్టి భ్రమగానే ఉండిపోయింది. మన రాష్ట్రంలో ప్రధానమైన ఈ తరహా అడవి ఉత్పత్తులు బంక, అడ్డాకు మొదలయినవి. వీటికి గిరిజన సహకార సంఘాలు ప్రైవేట్ వర్తకులకంటే తక్కువ ధర ఇస్తాయనీ, ఆ కారణంగా తాము దొంగచాటుగా ప్రైవేట్ వర్తకులకే అమ్ముకోవలసి వస్తోందనీ, ప్రభుత్వం దానిని దొంగతనంకింద జమకట్టి కేసులు పెడుతోందనీ గిరిజనులు ఎప్పుడూ ఫిర్యాదు చేస్తుంటారు వర్తకులు అడవి సంపదను గిరిజనులనుండి చవగ్గా కొనాలని చూస్తారు. ప్రభుత్వం అసలు అడవి సంపదను తన ఆస్తిగా భావిస్తుంది. దానిని ఒకరినుండి కొనే ప్రసక్తే లేదు. దానిని సేకరించి తెచ్చినందుకు గిరిజనులకు కూలిమట్టుకే ఇస్తుంది. ఆ కూలి సరుకు ధరకంటే చాల తక్కువ వుంటుంది. వర్తకులు ఇచ్చే చవక ధరకంటే కూడ తక్కువ వుంటుంది.

ఇకపోతే మిగిలింది రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970. షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనుల భూములేకాదు, గిరిజనేతరుల భూములుకూడ కొనగూడదని, అమ్మకూడదని ఈ నియమావళి అంటుంది. గిరిజనులనుండి తాము ఆక్రమించుకున్న భూములను గిరిజనేతరులు వేరే వ్యక్తులకు అమ్ముకొని వెళ్ళిపోయే అవకాశం వుంటే అసలు మొదట్లో ఆ భూమిని ఎట్లా ఆక్రమించుకున్నదీ తెలుసుకునే అవకాశం ఉండదని భావించి ఈ నియమం పెట్టారు. ఒకవేళ గిరిజనేతరులెవరైనా అత్యవసరంగా భూమి అమ్ముకోవలసివస్తే ప్రభుత్వమే దానిని కొనుక్కొని భూమిలేని గిరిజనులకు ఇవ్వాలి చివరిగా, షెడ్యూల్డు ప్రాంతాలలో భూమి కలిగిన గిరిజనేతరులు తాము ఆ భూమిని సక్రమంగా సంపాదించుకున్నామని తామే రుజువు చేసుకోవాలి.

1971 లోనే దీనిని పందిరి రామిరెడ్డి అనే గిరిజనేతరుడు కోర్టులో ఛాలెంజి చేశాడు. అది 17 సంవత్సరాలు హైకోర్టులోనూ, సుప్రీం కోర్టులోనూ గడిపి క్రిందటి సంవత్సరమే విజయవంతంగా తిరిగివచ్చింది. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం దానిని రద్దుచేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని సమర్థించడానికి ప్రభుత్వమూ, దానితో చేతులు కలిపిన ప్రతిపక్ష పార్టీలూ ఇస్తున్న వాదనలోని రెండు నాల్కల వైఖరిని (hypocricy) అర్థంచేసుకోవడం అవసరం. 1917లో బ్రిటిష్‌వాళ్ళు చట్టం తయారుచేసి అప్పటికి 70 సంవత్సరాలు గడిచాయి. అయినా

# ఆనకట్టలు - గిరిజనులు

—చక్రపాణి

మనదేశంలో మొత్తం 80 కోట్ల ఎకరాల భూమి వుంది. ప్రస్తుతం సాగులో 36 కోట్ల ఎకరాలు. అడవుల జాబితాలో మరొక 14 కోట్ల ఎకరాలు కలిపి 50 కోట్ల ఎకరాలు కాగితపు లెక్కల ప్రకారం వినియోగం అవుతున్నాయి. అయితే తక్కిన 30 కోట్ల ఎకరాలు పూర్తిగా నిరుపయోగంకాదనీ, అందులో దాదాపు 20 కోట్ల ఎకరాలు వన్య లేక వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడగల నేలేకానీ భూసార విధ్వంసంవల్ల పట్టిపోయినాయని ఒక అంచనా అని పేర్కొన్నాడు బాలగోపాల్ (అరుణతార 105) ఇంకా ఖారీ, మధ్యతరహా ఆనకట్టలవల్ల మన మొత్తం సాగుభూమిలో పన్నెండు శాతానికి మాత్రమే నీరు లభిస్తోందని అంటాడు.

నడుస్తున్న చరిత్ర చూసినట్లయితే ఈ పన్నెండు శాతంలో చాలా మేరకు భూస్వాములు, ధనికరైతుల చేతుల్లో వుంది. వీళ్ళు తమకూ, సామ్రాజ్యవాదుల స్వార్థాలకూ అనువైనవిధంగా ఈ భూమిని, నీటినీ వినియోగించేటట్లు చేస్తున్నారు. సామాజిక ప్రయోజనం ప్రాతిపదికగా, మొత్తం భూమి వినియోగంగానీ, నీటి వినియోగంగానీ, వ్యవసాయంగానీ సాగడంలేదు. సాగనీయడంలేదు.

ఆ సమస్య అలావుండగా ఆనకట్టలవల్ల ముంపుకు గురవుతూ ఉపాధిని, భూముల్నీ, జీవనాన్నీ, సంస్కృతినీ కోల్పోతున్నవారి స్థితి దయనీయంగా ఉంది. వీళ్ళు యిటీవలికాలంలో ఎక్కడికక్కడే ఉద్యమిస్తున్నారు తమ తమ కారణాలను పురస్కరించుకొని పర్యావరణ శాస్త్రవేత్తలు, మానవతావాదులు, విదేశీసాయం పొందుతున్న సంస్థలవాళ్ళు వీరికి మద్దతునిస్తున్నారు. మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక పరిస్థితులదృష్ట్యా అక్కడక్కడా కొన్ని విప్లవపార్టీలుకూడా ఈ ఉద్యమాలకు మద్దతునిస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రాజెక్టుల నిర్మాణం ఆగిపోయింది, ఆగి ఆగి కొనసాగుతోంది. ఈ క్రమంలో గిరిజనుల ప్రయోజనాల పరిరక్షణకు అభివృద్ధికి ఉపయోగపడిన మేరకు ద్వైమాస పత్రిక 'సంఘటిత'లో యిస్తున్న సమాచారాన్ని పరిశీలిద్దాం.

పైన పేర్కొన్న పన్నెండు శాతం నీటికొరకు ఆ భూస్వాముల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకొరకు ఆనకట్ట బాధిత ప్రజలు ఎంతో మూల్యం చెల్లించారు. చెల్లిస్తున్నారు. అందులో జనాభా దామాషారీత్యా గిరిజనుల నిష్పత్తి ఎంతో ఎక్కువ. మనదేశంలో నేటివరకు పూర్తయిన పెద్ద ఆనకట్టలవలన తరలించబడినవాళ్ళ వివరాల్ని యిచ్చారు. ఉదాహరణప్రాయంగా పరిశీలిద్దాం: జులై - ఆగస్టు '88 'సంఘటిత'లో యిలా పేర్కొన్నారు.

| ప్రాజెక్టు పేరు | సంవత్సరం | రాష్ట్రం | నది పేరు | కష్టాలకు గురైన ప్రజలు | గిరిజనుల శాతం |
|---|---|---|---|---|---|
| మైథాన్ & పాంచెట్ | 1956 | బీహార్, పశ్చిమ బెంగాల్ | దామోదర్ | 93,874 | 56.46 % |
| హీరాకుడ్ | 1956 | ఒరిస్సా | మహానది | 1,10,000 | 18.34 % |
| భాక్రా | 1959 | హిమాచలప్రదేశ్ | సట్లెజ్ | 36 000 | 34.76 % |
| పాంగ్ | 1962 | ,, | బియాస్ | 80,000 | 56.25 % |
| ఉకై | 1971 | గుజరాత్ | తపతి | 52,000 | 18.92 % → |

షెడ్యూల్డు ప్రాంతాలలో 56 శాతం భూభాగం గిరిజనేతరుల పేరుమీద వుందని చూశాం. దీని విస్తీర్ణం 8.7 లక్షల ఎకరాలు. కాగా, ఈ 70 సంవత్సరాల చట్టాల అమలులో గిరిజనులకు తిరిగి ఇప్పించిన భూమి 80 వేల ఎకరాలు మాత్రమే - అంటే అందులో 9 శాతం మాత్రమే. చట్టాల అమలు అంత చక్కగా వుంది. ఈ చట్టాలవలన గిరిజనేతరులలోని సామాన్య రైతులకు ఇబ్బంది కలుగుతోందని ఇవ్వాళ అందరూ వాదిస్తున్నారు. అది నిజమయితే దానికి బాధ్యులెవరు? గిరిజనులా, ప్రభుత్వ యంత్రాంగమా? షెడ్యూల్డు ప్రాంతాలలో జరుగుతున్న దేమిటంటే ఈ చట్టాలవలన గిరిజనులకేమీ ప్రయోజనం లేకపోగా, ప్రభుత్వ అధికారులూ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మధ్య దళారులూ బాగుపడుతున్నారు. కేసులు పెడతామన్న బెదిరింపుతో గిరిజనేతరులనుండి, భూములు ఇప్పిస్తామన్న ఆశ చూపించి గిరిజనులనుండి డబ్బులు లాగుతున్నారు. వాస్తవం ఇలావుండగా, ఇప్పుడు గిరిజనేతరులలోని మామూలు రైతులకు ఈ చట్టాలవలన ఇబ్బంది కలుగుతోందని చెప్పి '1 ఆఫ్ 70'ని రద్దుచేస్తామనడం నీతిమాలినతనం. నిజానికి చిత్తశుద్ధే వుంటే, అన్ని గ్రామాలలోనూ గిరిజనుల నందరినీ కూర్చోబెట్టి ఏ కమతం ఎవరిచేతిలోకి ఎట్లా వచ్చిందో పంచాయితీ నిర్వహిస్తే చాలావరకు నిజం బయటపడుతుంది. గట్టిగా ఒకటి రెండేళ్ళు శ్రమిస్తే బదలాయింపు అయిన భూమి మొత్తం గుర్తించవచ్చును. అప్పుడు కావాలంటే పేద రైతులకు మినహాయింపు ఇమ్మని గిరిజనులను అడగడమో లేక ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండుచేయడమో సాధ్యం అవుతుంది. నిజానికి ఇవాళ షెడ్యూల్డు ప్రాంతాలలో చాల విషయాలమీద గిరిజనులూ, గిరిజనేతర పేదలూ కలిసే పోరాటాలు చేస్తున్నారు. అటవీశాఖలోని అవినీతి, అణచివేత స్వభావం, ఫారెస్టు డిపోలలో కలప కొట్టడానికి ఇచ్చే కూలి రేట్లు, తునికాకు, వెదురు (బొంగు) కూలిరేట్లు, రిజర్వ్ ఫారెస్ట్‌లో పట్టాలు మొదలయిన అనేక విషయాలమీద ఐక్యపోరాటాలు చేస్తున్నారు. గిరిజనులకు అన్యాయం చేసే చట్టాలను సమర్థించి ఐక్యతను సాధించ నక్కర లేదు. ఒకరి పేరుచెప్పి ఇంకొకరి కడుపుకొట్టే పాలకవర్గ విధానాలను సమర్థించ నక్కరలేదు.

— × —